

# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 199 పేజీలు : 8 వెల : రూ.2/- శుక్రవారం 14 ఆగస్టు 2026

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## అమరావతి నిర్మాణం

# రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక

- అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా...
- వారే లేకుంటే అమరావతే లేదన్నది సత్యం
- రైతులను భాగస్వాములను చేసేందుకే ల్యాండ్ పూలింగ్
- గ్రాఫిక్స్ అన్నవారికి చెంపపెట్టులా నిర్మాణాలు
- సైబరాబాద్ స్ఫూర్తితో అమరవాతి నిర్మాణానికి అడుగు
- స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు






**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 13:** అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారు ముందుకు రాకుంటే ఇవాళ రాజధాని నిర్మాణాన్ని ఊహించలేమని అన్నారు. గత ప్రభుత్వం వారిని కేసులతో అనేక ఇబ్బందులకు గురిచేసినా, రాజధాని కోసం త్యాగాలకు వెరవలేదని అన్నారు. రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జీల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.రాష్ట్ర విభజన మిగతా2లో...



## పిల్లల ఆరోగ్యంపై

# ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 13:** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈఫూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని మిగతా2లో...

## విజయవాడ నుంచి కాశీకి

# నేరుగా విమానం

- ఇండిగో సర్వీసును ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు


2లో

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా


2లో

## సమగ్ర ఏనుగు

# సంరక్షణ ప్రణాళిక

- ఏనుగుల సంరక్షణతో పాటు జీవనోపాధి
- ఏనుగులతో పంటనష్టం, ప్రాణనష్టంపై ఆందోళన
- కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్



**విశాఖపట్నం,మన జనప్రగతి ఆగస్టు 13:** ఏనుగుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. విశాఖలో జరిగిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. మానవ-ఏనుగు మధ్య ఘర్షణలు తీవ్రమైన సమస్యగా మారాయన్నారు. దీనికి తాత్కాలిక చర్యలకంటే శాస్త్రీయ పరిశోధన ఆధారిత సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు. ఏనుగుల మిగతా2లో...


2లో

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

# రాజధానితోనే రాష్ట్రానికి ఆదాయం

- అన్ని జిల్లాలకు మధ్యలో అమరావతి
- పురపాలక శాఖ మంత్రి నారాయణ


2లో

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన

# ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 13:** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
14- 08 - 2026

# అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నామని, రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం కాని పరిస్థితి అన్నారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. కేవలం ఓ 50 ఎకరాల్లో భవనాలు నిర్మించవచ్చని, అయితే భవిష్యత్ ఏం కావాలన్న ప్రశ్న ఉదయించడంతో అమరావతి నిర్మాణానికి పూనుకున్నామని అన్నారు. అయితే ఇందుకోసం భూములు కావాలి కదా? మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని నాటి సంగతులను సీఎం చంద్రబాబు వివరించారు.సింగపూర్ మోడల్‌తో అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ ప్రభుత్వం ఉచితంగా ప్లాన్ ఇచ్చారని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి కనెక్టివిటీ పెరగనుందని పేర్కొన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించా నని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రైతులు లేకపోతే రాజధాని లేదని చెప్పుకొచ్చారు. ఆనాడు అమెరికాలో పర్యటించి.. సైబరాబాద్ రూపకల్పన చేశామని ప్రస్తావించారు. రూపాయి తీసుకోకుండా అమరావతి కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ రూపొందించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు. హైదరాబాద్ ఆదాయం పెరగడానికి తాను చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతిని ఎంపిక చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆనాడు హైటెక్‌సిటీ నిర్మిస్తే కొంతమంది ఎగతాళి చేశారని అన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని వెల్లడించారు. హైటెక్‌సిటీ నిర్మాణం దశలోనూ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు పట్టించుకోకుండా సైబరాబాద్ నిర్మాణంపై దృష్టి పెట్టామని తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్ ఎదుగుదల చూసి గర్వపడుతున్నామని అన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించానని చెప్పారు. హైదరాబాద్‌ను మించిన మహానగరాన్ని నిర్మించాలని తాము సంకల్పించామని అన్నారు. సింగపూర్ మోస్ట్‌లివబుల్ కంట్రీ.. అందుకే ఆ మోడల్ తీసుకున్నామని వెల్లడించారు. (గ్రాఫిక్స్ అంటూ అమరావతిని వైసీపీ నేతలు ఎగతాళి చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడొచ్చి చూడండి.. అమరావతి ఎలా ఉందో అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఆనాడు అమరావతిని రాజధానిగా అంగీకరించారని ప్రస్తావించారు. 5,10 కాదు.. 40వేల ఎకరాలు కావాలని జగన్ చెప్పారన్నారు. ఆ తర్వాత రాజధాని పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. జగన్ హయాంలో రాజధాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది.. అమరావతి ఉద్యమమని తెలిపారు. అమరావతి చరిత్రలో రైతులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. దేవతల రాజధాని అమరావతి.. ఇక్కడ ఇబ్బందులు ఉండవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి ద్వారా రాజధానికి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నాం. అమరావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు. నీటి సమస్యలేని ఏకైక రాజధాని అమరావతి. విద్యుత్ స్తంభాలు, వైర్లు కనిపించని ఆధునిక నగరమిది. గ్యాస్‌తో సహా అన్నీ భూగర్భం నుంచే వెళ్లే రాజధాని మన అమరావతి. ఇవాళ ప్రారంభించిన రోడ్డు చిన్న ట్రైలర్ మాత్రమే. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. రాష్ట్రాభివృద్ధిలో మొదటి మెట్టు ఎక్కాం. రాజధానితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ కావాలన్నదే అందరి సంకల్పం కావాలి. అమరావతి నిర్మాణం చేసి చరిత్ర సృష్టిస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రలుఉ పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

సంరక్షణలో పురోగతి సాధించినప్పటికీ పంట నష్టం, ప్రాణనష్టం, అలాగే ఏనుగుల మృతి వంటి ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళికను రూపొందించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందిస్తూ బందీ ఏనుగుల డీఎన్ఏ డేటాబేస్‌తో పాటు ఏనుగుల కదలికలను పర్యవేక్షించే 'గజ సూచన' యాప్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. ఘర్షణలను తగ్గించడంలో ఏనుగుల ప్రవర్తనపై అధ్యయనానికి ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఏనుగుల మృతిని నివారించేందుకు రైల్వే శాఖతో సమన్వయంగా ప్రమాదకర ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఫెన్సింగ్, హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. విద్యుత్ లైన్ల కారణంగా జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు కూడా అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. సిక్కిం, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో మూడు కొత్త ఏనుగు రిజర్వులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఘర్షణలకు ఒకే విధమైన పరిష్కారం ఉండదని, ప్రాంతాలవారీగా కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా ముందస్తు అంచనా ఆధారిత వ్యవస్థ అవసరమని చెప్పుకొచ్చారు. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సేకరించిన డేటా ఆధారంగా ప్రమాద ప్రాంతాలను గుర్తిస్తున్నామని కేంద్ర మంత్రి అన్నారు.

రాష్ట్రాల మధ్య అనుభవాలను పంచుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయన్నారు. ఏనుగుల సంరక్షణ, ఘర్షణల నివారణ కోసం రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధుల ద్వారా శాస్త్రీయ చర్యలను విస్తృత స్థాయిలో అమలు చేయవచ్చన్నారు. ఏనుగులు, ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణ ప్రభుత్వాల బాధ్యత అని, కేంద్ర-రాష్ట్ర సమన్వయంతోనే దీర్ఘకాలిక పరిష్కారాలు సాధ్యమవుతాయని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు.

# రాజధానితోనే రాష్ట్రానికి ఆదాయం

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 13:** రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని.. ఏపీకి ఆర్థిక రాజధాని కట్టాలని సీఎం చంద్రబాబు భావించారని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను, బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జిను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచే ఎక్కువగా వస్తోందన్నారు. అలాగే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులకు ముంబాయి, బెంగళూరు, చెన్నైల ద్వారా ఆదాయం వస్తోందని తెలిపారు. ఆర్థిక రాజధాని నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా అందించిందని చెప్పుకొచ్చారు. ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం నార్మల్ ఫాస్టర్స్ లండన్ వారిని సంప్రదించినట్లు తెలిపారు. కృష్ణానది ఒడ్డున అమరావతి కడితే అన్ని జిల్లాలకు సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు.అమరావతి.. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు మధ్యలో ఉంటుందని మంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గం అందుబాటులో ఉందన్నారు. 2015 జనవరిలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ ఇచ్చామని.. కేవలం 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా 34,000 ఎకరాలను రైతులు ఇచ్చారని వివరించారు. అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర పనులు చేపట్టడానికి మూడున్నర సంవత్సరాలు పట్టిందన్నారు. మిగిలిన సంవత్సరం 6 నెలల్లో పదివేల కోట్లు అమరావతి కోసం ఖర్చు చేశామని అన్నారు. గంతలో వైసీపీ అధికారంలోకి వచ్చి మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడిందని మంత్రి విమర్శించారు. అమరావతి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ ఆపేసిందన్నారు. నిర్మాణ సంస్థల ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేసిందని.. దీంతో కూటమి ప్రభుత్వం తిరిగి వచ్చాక ఆయా సంస్థలతో ఒప్పందాలను టెక్నికల్‌గా క్లోజ్ చేసి తిరిగి టెండర్లు పిలవాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఉన్న పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, హైదరాబాద్ వారితో పరీక్షింప చేసి పనులను ప్రారంభించామన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్‌ను ఆనుకుని ఎలక్ట్రికల్, గ్యాస్, టెలిఫోన్ వాటర్ వంటివి అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ప్లాన్ చేశామన్నారు. వైసీపీ ఓ గొడ్డలి పార్టీగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని.. అయినా రైతులు అమరావతి నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఇలాంటి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# విజయవాడ నుంచి కాశీకి నేరుగా విమానం

**విజయవాడ,మన జనప్రగతి ఆగస్టు 13:** ఏపీ ప్రజలకు మరో కీలక విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ విమానాశ్రయం నుంచి వారణాసికి నేరుగా నూతన ఇండిగో సర్వీసులను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కాశీ యాత్ర మరింత సులభం కానుంది. ఈ విమాన సర్వీసులు వారానికి మూడు రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. మంగళ, గురు, శనివారాలు ఈ నగరాల మధ్య విమానాలు నడపనున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రాంతీయ విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలను ప్రధాన విమానాశ్రయాలకు అనుసంధానం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభం రాష్ట్ర విమానయాన రంగంలో మరో కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. విమాన ప్రయాణాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ కొత్త సర్వీసు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చనుందన్నారు. మరోవైపు హుస్సేన్ సాగర్, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం జలాశయం మధ్య సీ ప్లేన్ ప్రాజెక్ట్ కోసం వ్యూహరచన సిద్ధం చేస్తున్నామని రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇండిగో ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 13:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

**కర్నూలు,మన జనప్రగతి ఆగస్టు 13:** రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు.

పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగష్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగు తుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

# ప్రసూతి మరణాలు జరగకూడదు

**● ఆశా, ఏఎన్ఎంలు గర్భిణీలకు అందుబాటులో ఉండాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 13:-** జిల్లాలో ప్రసూతి మరణాలు సంభవించకుండా ప్రతి గర్భిణీకి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రసూతి మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు జరిగిన నాలుగు మాతృమరణాల కేసులను పరిశీలించి కారణాలను ఆరా తీశారు. గర్భిణీలకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, హైరిస్క్ కేసులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. బాల్యవివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో చేరిన గర్భిణీలను నిరంతరం పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. మాతృ మరణాలకు దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. కామేశ్వర ప్రసాద్, డీసీహెచ్ఎస్ డా. జాఫ్రుల్లా, ఐసీడీఎస్ పీడీ విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో దేశభక్తి వెల్లువ.

**- ఘనంగా తిరంగా సైకిల్ ర్యాలీ,మానవహారం వనం మనం కార్యక్రమం**



**ఎమ్మిగనూరు మన జనప్రగతి ఆగస్ట్ 13:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో దేశభక్తి, జాతీయ ఐక్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డిఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మాచాని సోమప్ప జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఓం శాంతి సర్కిల్ వరకు తిరంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డితో పాటు నియోజకవర్గ ప్రత్యేక అధికారి సురేష్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు మానవహారంలో పాల్గొని జాతీయ ఐక్యత, సమగ్రతకు తమ సంఘీభావాన్ని చాటారు.అనంతరం పాల్గొన్న వారందరూ భారత ప్రతిజ్ఞ చేసి దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం తమ బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా "వనం మనం" కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో మొక్కలు నాటడం, పంపిణీ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 25,వేల మొక్కలను పంపిణీ చేసి నాటేలా ప్రణాళిక రూపొందించారు.పార్కులో నిర్వహించిన వనం మనం కార్యక్రమంలో సీ.ఎస్.ఓ సురేష్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు తహసీల్దార్ మొక్కలు నాటి, మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ఓటర్ల జాబితా సవరణ గడువులోగా పూర్తి చేయాలి

**22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు: కలెక్టర్ హరేంధిర ప్రసాద్**




**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 13:-**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ గురువారం 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు.నోటీసుల జారీ, పంపిణీ, బీఎల్ఓబీఎల్ఏ సమావేశాల మినిట్స్, ఫారం6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలపై సమీక్ష జరిగింది.జిల్లాలోని 1,822 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి నోటీసుల జారీ, బీఎల్ఓ సమావేశాల మినిట్స్ అప్‌లోడ్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఏడు నియోజకవర్గాల్లో 31,695 నోటీసులు జారీ చేయగా.. 7,335 పంపిణీ అయ్యాయని చెప్పారు. మిగిలిన నోటీసుల పంపిణీని వేగవంతం చేస్తున్నామన్నారు.కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6లో 7,724 దరఖాస్తులు, ఫారం7లో 219, ఫారం8లో 5,174 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ ద్వారా వచ్చిన 18 కాల్స్‌ను 48 గంటల్లో పరిష్కరిస్తామని తెలిపారు.క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 30 వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందని, వాటిని సెప్టెంబరు 28లోగా పరిష్కరించి అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# ప్రభుత్వ కొలువుకు సార్ధకత....

**● విద్యార్థులకు ఉన్నతమైన విద్యనభ్యసించి... ఉన్నత శిఖరాలకు చేరి. ● ఓ ప్రభుత్వం ఉపాధ్యాయుని శ్రమకు దక్కిన ఫలితం.**

**కర్నూలు బ్యూరో పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 13:** మారుమూల పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివి తాను చదివిన చదువు ఇతరులకు ఉపయోగపడేలా ఉపాధ్యాయునిగా కొలువు సాధించి చిన్న గ్రామంలో నుండి విదేశాలకు శిక్షణ నిమిత్తం తీసుకువెళ్లే గుర్తింపు తెచ్చుకున్నా ఓ ఉపాధ్యాయిని... తాను పల్లెల్లో చదివిన చదువుతో రాణించి ఉపాధ్యాయునిగా కొలువు సాధించింది. తమ గ్రామంలో లాంటి మరెన్నో గ్రామాల్లో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉద్దేశంతో ప్రస్తుతం పల్లెల్లో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై తరగతి గది నుంచి అంతర్జాతీయ వేదిక ఫిన్లాండ్ వరకు చేరుకున్న ఉత్తమ ఉపాధ్యాయుని జి. వినుత, ఎస్జిటి విజయ ప్రస్థానం"పై మన జనప్రగతి అందిస్తున్న కథనం...ఒక సాధారణ కుటుంబంలో జన్మించి,ప్రభుత్వ పాఠశాలలో చదువు చదివి 2008 డీఎస్సీ ద్వారా ప్రభుత్వ కొలువు సాధించి అనంతపూర్ జిల్లా,కళ్యాణదుర్గం తాలూకా, కంబదూర్ మండలం నుంచి ప్రారంభమైన ఉద్యోగ ప్రయాణ,2019 లో అంతర్ జిల్లాల బదిలలో బాగంగా కర్నూలు జిల్లా, పత్తికొండ తాలూకా- మండలం ఎంపీపీ ఎస్.డబ్ల్యూ



స్కూల్,హోసూరు గ్రామానికి ఉపాధ్యాయునిగా రావడం జరిగింది.అక్కడి నుండి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతూ,సృజనాత్మక బోధనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.2023 లో కర్నూల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడం, అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన "స్టేట్ బెస్ట్ టీచర్ 2025" పురస్కారం సాధించారు జి.వినుత.అక్కడి నుంచి అంతర్జాతీయ విద్యా విధానాలను నేర్చుకునేందుకు ఫిన్లాండ్ వెళ్లే ఉపాధ్యాయ బృందంలో ఆమె స్థానము సంపాదించడం గర్వకారణం. ఇలాంటి గుర్తింపు రావడం ప్రతి ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకం.హోసూరు గ్రామం లో ఉపాధ్యాయురాలిగా ప్రారంభమైన ఈ ప్రయాణం కేవలం ఒక వ్యక్తి విజయగాథ కాదు. "విద్యార్థి నేర్చుకోవాలిఢ ఆనందంగా నేర్చుకోవాలిఢ తనలోని ప్రతిభను వెలికితీయాలి" అనే లక్ష్యంతో సాగిన నిరంతర కృషికి ప్రతిఫలం అంటున్నారు జి.వినుత.తరగతి గదిలో "లెర్నింగ్ బై డూయింగ్".. "లెర్నింగ్ త్రు యాక్టివిటీస్" ఎఫ్.ఎల్.ఎన్ పద్ధతులు, తక్కువ ఖర్చుతో తయారు చేసిన టి.ఎల్.ఎంలు, డిజిటల్ టెక్నాలజీ, సృజనాత్మక బోధనా విధానాలు వంటి అనేక ప్రయోగాలతో అదేవిధంగా ప్రత్యేకంగా హ్యాపీ చిల్డ్రన్ అనే వాట్సప్ గ్రూప్ మరియు "వినుతారమేష్" అనే యూట్యూబ్ ఛానెల్ ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని పెంచే ప్రయత్నం కొనసాగించారు. విద్యార్థులే కేంద్రంగా బోధనను మార్చుతూ, సాంకేతికతను సృజనాత్మకతతో మేళవిస్తూ చేసిన కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "స్టేట్ బెస్ట్ టీచర్ 2025" పురస్కారం అందుకున్నారు.ఆ పురస్కారం ఒక ముగింపు కాదుఢమరో కొత్త అధ్యాయానికి ఆరంభం అని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వంస్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఫిన్లాండ్‌లోని విద్యా విధానాలు, బోధనా పద్ధతులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించబడింది.హోసూరు నుంచి ఫిన్లాండ్ వరకు ఒక ఉపాధ్యాయురాలు అడుగులు ఇప్పుడు అంతర్జాతీయ విద్యా ప్రపంచం వైపు చూడడం గర్వంగా ఉంది.ఈ ప్రయాణం చెప్పే సందేశం ఒక్కటే" కలలు కంటే.. వాటిని నిజం చేసే కృషి గొప్పది." ఉపాధ్యాయురాలు జి. వినుతఇలాంటి విజయాలు, ఉన్నత శిఖరాలు ఎన్నో చేరుకోవాలని ఆకాంక్షిద్దాం.

# రైతులకు తొలి ప్రాధాన్యతతో రైతు బజార్ల నిర్వహణ

**గోవర్ధన్ నగర్‌లో నూతన రైతు బజార్ ప్రారంభం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 13:** రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునేలా రైతు బజార్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. గురువారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం గోవర్ధన్ నగర్‌లో రూ. 54.52 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను స్థానిక ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నురూల్ కమర్ లతో కలిసి జిల్లాకలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఐదు రైతు బజార్లు పనిచేస్తున్నాయని, మరో నాలుగు రైతు బజార్ల ఏర్పాటుకు అవసరమైన భూమిని కేటాయించామని కలెక్టర్ తెలిపారు. త్వరలోనే ఆయా రైతు బజార్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రైతు బజార్లలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలను బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించి, అదే ధరలకు కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు, వినియోగదారులకు కూడా కూరగాయల ధరలపై స్పష్టత ఉంటుందన్నారు. రైతు బజార్లలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక






ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. మరుగుదొడ్లు, ఆర్ఓ ప్లాంట్లు, స్టాళ్లకు అవసరమైన మరమ్మతులు తదితర సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గోవర్ధన్ నగర్ పరిసర ప్రాంతాల రైతులు గతంలో సి-క్యాంప్ తదితర ప్రాంతాల్లోని రైతు బజార్లకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థానికంగానే రైతు బజార్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ వివరించారు. గోవర్ధన్ నగర్ రైతు బజార్‌లో 34 స్టాళ్లను ఏర్పాటు చేశామని, 34 మంది రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు రైతు బజార్లలో స్టాళ్ల కేటాయింపులో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, అనంతరం వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ రంగంలో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రాధాన్యత కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులకు మరియు వినియోగదారులకు మధ్య దళారీ వ్యవస్థను తగ్గించే విధంగా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతు బజార్ల ద్వారా రైతులకు నేరుగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ 201419 ప్రభుత్వం హయాంలోనే గోవర్ధన్ నగర్‌లోని ఈ స్థలాన్ని పరిరక్షించామని తెలిపారు. అప్పట్లో స్థానిక రైతుల కోరిక మేరకు ఇక్కడ రైతు బజార్ ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు ప్రారంభించామని, అప్పటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి సహకారంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఏడి, ఏ.నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ అధికారి రఘురాం రెడ్డి, సెక్రెటరీ ఆర్. జయలక్ష్మి, నంద్యాల ఏడి రెహమాన్ , పాణ్యం సెక్రటరీ రెహమాన్, తాసిల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# మరణంలోను వెలుగు చూపడమే అవయవదానం: జిల్లా ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ మన జనప్రగతి ఆగస్ట్ 13:-**మరణంలోను మరొకరికి వెలుగు చూపడమే అవయవదానమని జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవయవ దాన దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థుల సహకారంతో అవగాహన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి భానుగుడి కూడలి వరకు సాగింది.ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ అవయవ దానం సమయంలో పోలీసు శాఖ గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి సహాయపడుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్న మెడికవర్ హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులను అభినందించారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె అనిత మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవం జరుపుకుంటారని, అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అవయవ లోపంతో బాధపడుతున్న రోగులకు కొత్త జీవితాన్ని ఇవ్వడం, అవయవ దాతలుగా నమోదు చేసుకోవడానికి ప్రజలను ప్రోత్సహించడం ఈ రోజు యొక్క లక్ష్యం అని అన్నారు.ప్రమాదాల్లో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి లేదా మరణించిన వారి అవయవాల ద్వారా 8 మందికి కొత్త జీవితాన్ని ఇవ్వవచ్చుని గుండె, కాలేయం,




మూత్రపిండాలు, ఊపిరితిత్తులు , క్లోమం,కణజాలాలు, కంటి కార్నియా, చర్మం, ఎముకలు, గుండె కవాటాలు దానం చేయదగిన అవయవాలని అన్నారు.18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ప్రతిజ్ఞ చేయవచ్చుని,తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 'జీవన్ దాన్' వంటి కార్యక్రమాల ద్వారా అవయవ మార్పిడి ప్రక్రియను క్రమబద్ధీకరిస్తున్నారనిమరణంలోనూ మరొకరికి వెలుగు చూపడమే అవయవ దానం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించి, అవయవ దానానికి ముందుకొచ్చేలా ప్రతి ఒక్కరిలో చైతన్యం నింపాలని కోరారు.మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ నందికోళ్ల అంజిబాబు మాట్లాడుతూ అవయవ దానం పట్ల అవగాహన కల్పించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టామని, ఇందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ట్రాఫిక్-2సీఐ రామారావు తన సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చేసి సహకరించారు. యూరాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ బాబు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజా అమరేంద్ర, ఎనస్తీషియా డాక్టర్ కిషోర్ బాబు, క్రిటికల్ కేర్ డాక్టర్ అరవింద్,వీలయన్స్ క్లబ్ స్వయంకృషివైస్ ప్రెసిడెంట్ వినితా రెడ్డి, కోశాధికారి సురేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఎలైట్ ఎమ్.సత్యనారాయణ, లయన్స్ క్లబ్ శ్రీకారం 2వ వైస్ ప్రెసిడెంట్ మెట్టా రాధా సరస్వతి,రీజనల్ చైర్పర్సన్ కె ఉమాదేవి, నందూరి విజయ్, హాస్పిటల్ సిబ్బంది, ఆదిత్య నర్సింగ్, ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# సంటి గారి పల్లెలో పారిశుధ్య సమస్యలు

**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 13:** మండలంలోని సంటి గారి పల్లె ఎస్సీ కాలనీ సమీపంలో మురుగునీరు స్తంభించడంతో దుర్వాసన వెదజల్లుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దోమల బెడద పెరిగి, విషజ్వరాల భయం నెలకొందని తెలిపారు. అలాగే గ్రామంలో రాత్రివేళ విద్యుత్ దీపాలు పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మూడు నెలలుగా ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని వారు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీవో ఫణి రాజకుమారిని వివరణ కోరగా, ఎస్సీ కాలనీ సమీపంలో స్తంభించిన మురుగునీటిని తొలగించేలా పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అలాగే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# బంగారు దుకాణాల్లో భద్రతా చర్యలు తప్పనిసరి



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 13:**-మండలంలోని భాకరాపేట గ్రామంలో కడపచెన్నై జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన యాసీన్ జువెలర్స్ బంగారు దుకాణాన్ని గురువారం ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బంగారు, వెండి వ్యాపారులు తమ దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు బంగారం, వెండి లేదా ఇతర విలువైన వస్తువులను తాకట్టు పెట్టేందుకు వచ్చినప్పుడు వారి ఆధార్ కార్డుతో పాటు పూర్తి చిరునామా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 100 డయల్కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, యువనేత తుర్ర ప్రతాప్ నాయుడు, జువెలర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల భద్రత పై పోలీసుల అవగాహన కార్యక్రమం



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 13:**-చిట్వేలి మండల పరిధి లోని రాజుకుంట గ్రామంలో గురువారం మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాలికా సంరక్షణ తదితరాలపై రైల్వే కోడూరు గ్రామీణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, డిఎస్పీ వారి ఆదేశానుసారం అన్ని గ్రామాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, బాలికల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్ లకు స్పందించవద్దు అని సూచించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలనువివరించి వాటి నివారణకు సహకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 సేవలను వినియోగించుకోవాలని, గ్రామంలో అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం తెలపాలని ఎస్ఐ. వినోద్ కుమార్ కోరారు. ఏ.ఎస్ ఐ. వెంగయ్య, మహిళా పోలీస్ కానిస్టేబుల్ రాధిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగమ్య గోచారంగా బిల్ కలెక్టర్ల బతుకులు

- 20 సంవత్సరాలుగా చేసిన సేవలకు మంగళం పాడిన విద్యుత్ శాఖ
- కొత్త విధానాలతో అవస్థలు పడుతున్న వినియోగదారులు






**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 13:** గత 20 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ప్రతిపాదికన పనిచేస్తున్న బిల్ కలెక్టర్లుగా సేవలు చేసిన సిబ్బందికి విద్యుత్ శాఖ అధికారులు మంగళం పాడనున్నారు.... విద్యుత్ శాఖ తీసుకుంటున్న నిర్ణయాలతో జిల్లాలో మొత్తం 50 నుండి 60 మంది బిల్ కలెక్టర్ల బతుకులు ఆగమ్య గోచారంగా మారనుందని తెలుస్తోంది. కొత్తగా వస్తున్న విధానాల వల్ల వారి పోస్టులను తొలగించి వారు బజారున పడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం, విద్యు త్ శాఖ తీసుకుంటున్న నిర్ణయాలతో బిల్ కలెక్షన్ చేస్తున్న ఉద్యోగులు లబో దిబో అంటున్నారు. కొత్తగా విద్యుత్ శాఖలో బిల్ కలెక్షన్ కేంద్రాలను మూసివేసి ఇకపై విద్యుత్ యోగదారుడు ఆన్లైన్లోనే (కరెంట్ బిల్లులు) చెల్లింపులు చేయాలని కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో వినియోగదారులు సైతం అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లులు కలెక్షన్ కేంద్రాలకు వెళ్తే వారు బిల్లు కట్టి రసీదులు ఇచ్చేవారు. ఆన్లైన్ ద్వారా ఎన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో లాగానే విద్యుత్ బిల్లులు కలెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల కు అందుబాటులో సేవలు తేవాలని ప్రజలు కోరుతున్నారు. కొత్త విధానాలతో అటు కలెక్షన్ సిబ్బంది ఇటు వినియోగదారుడు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలుస్తోంది. అయితే తొలగించిన కాంట్రాక్టు బిల్లు కలెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని బిల్ కలెక్టర్ కార్మికుల సంఘం నాయకులు కోరుతున్నారు.

# నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి: సీపీఐ

**ఈ నెల 18న చలో కలెక్టరేట్కలెక్టరేట్ ముట్టడి**

**ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి**




**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 13:** వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య డిమాండ్ చేశారు. పత్తికొండలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన "మార్పు రావాలి.. మార్పు కావాలి" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రెండు మూడు నెలలుగా సరైన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అప్పులు చేసి పంటలకు పెట్టుబడులు పెట్టిన రైతులు.. పంటలు దెబ్బతినడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాభావంతో నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని, కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని, వేరుశనగ విత్తనాలను 100 శాతం సబ్సిడీతో రైతులకు నేరుగా పంపిణీ చేయాలని కోరారు.గత ఏడాది పత్తి పంటకు కనీస మద్దతు ధర లభించక రైతులు నష్టపోయారని తెలిపారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నెల 18న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "చలో కలెక్టరేట్కలెక్టరేట్ ముట్టడి" కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రామచంద్రయ్య పిలుపునిచ్చా రు. సీపీఐ జిల్లా, మండల నాయకులు, ఏఐటీయూసీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న రూ.10 లక్షల బంగారు ఆభరణాలను గుర్తించిన పోలీసులు..!

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 13:** ఆటోలో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయిన సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగును ప్రొద్దుటూరు వన్టౌన్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి బాధితురాలికి అప్పగించారు.ప్రొద్దుటూరు నేతాజీ నగర్కు చెందిన ఎస్.కె. ప్యారిజాన్ (70) గురువారం తన ఇంటి నుంచి ఆటోలో పాత బస్టాండ్కు వెళ్తుండగా మార్గమధ్యలో ఆమె వద్ద ఉన్న బ్యాగ్ ఆటో నుంచి జారిపడింది. పాత బస్టాండ్కు చేరుకున్న అనంతరం బ్యాగ్ కనిపించకపోవడంతో ఆమె వెంటనే ప్రొద్దుటూరు వన్టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో వన్టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టి.వి. కొండారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది లాల్పీరా, రామచంద్ర, శివకుమార్ రంగంలోకి దిగారు. బాధితురాలు ప్రయాణించిన ఆటోను విచారించడంతో పాటు మార్గమధ్యంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బ్యాగ్ ప్రొద్దుటూరు పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ సమీపంలో పడిపోయినట్లు గుర్తించారు. పోలీసులు బ్యాగ్ను వెదికి పట్టుకుని అందులో ఉన్న సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. ఆభరణాలను బాధితురాలు ఎస్.కె. ప్యారిజాన్కు పోలీసులు అప్పగించారు. పోగొట్టుకున్న విలువైన ఆభరణాలను తక్షణమే స్పందించి సీసీ కెమెరాల సహాయంతో గుర్తించి బాధితురాలికి అందజేసిన వన్టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఇన్స్పెక్టర్ టి.వి. కొండారెడ్డి అభినందించారు.




# 600 మీటర్ల జాతీయ పతాకంతో భారీ ర్యాలీ



**కాకినాడ మన జనప్రగతి ఆగస్ట్ 13:**-ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దే శభక్తి,జాతీయ సమైక్యతను పెంపొందించడమే లక్ష్యంగా కాకినాడలో నిర్వహించి హర్ ఘర్ తిరంగా.. కార్యక్రమానికి ఘన స్పందన లభించింది. బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ షేక్ సర్దార్ హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం భానుగుడి సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు 220 మీటర్లు నిడివి కలిగిన భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ హుస్సేన్ మాట్లాడుతూ దేశ ప్రజల్లో దేశభక్తి భావనను మరింతగా పెంపొందించడంతో పాటు జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటిచెప్పే ఉద్దేశంతో ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ ర్యాలీలో ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువతతో పాటు భాజపా నాయకులు, మైనారిటీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, దేశభక్తి కలిగిన ప్రజలు భారీగా పాల్గొని జాతీయ జెండాను చేతబూని దేశభక్తిని చాటారు. దేశం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, జాతీయ సమైక్యతను కాపాడుకోవాలని సర్దార్ హుస్సేన్ పిలుపునిచ్చారు. "తిరంగా మన గర్వం.దేశం మన బాధ్యత" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భాజపా మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు లలిత్ జైన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భాజపా అధ్యక్షులు రాజేష్ కుమార్ జైన్, కాకినాడ జిల్లా భాజపా మైనార్టీ సెల్ఎం డిజె అహ్మద్, పిల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# చిట్వేలిలో ఘనంగా ఉమా మహేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 13:** చిట్వేలి గ్రామ మాజీ ఉపసర్పంచ్ చౌడవరం ఉమా మహేశ్వరరెడ్డి 56వ జన్మదిన వేడుకలను గురువారం స్నేహితులు, సన్నిహితులు, వైసిపి కార్యకర్తలు కలసి ఆనందోత్సహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్వేలి లోని చౌడవరం రఘురామిరెడ్డి ఎస్టేట్ లో ఏర్పాటుచేసిన రక్త దాన శిబిరాన్ని సమాజ సేవకుడు డాక్టర్ దొండ్లవాగు చంద్రశేఖర్ చిట్వేలి లోని రాజకీయ నేతలతో కలసి ప్రారంభించగా శతాధిక రక్తదాత డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ పర్యవేక్షించారు. రెడ్ క్రాస్ సంస్థ తిరుపతి, కడప జిల్లాల బ్రాంచీలు, తిరుపతికి చెందిన విజయ శ్రీ బ్లడ్ బ్యాంక్ బ్రాంచీల వారు రక్తం సేకరించారు. ఈ శిబిరంలో మొత్తం 120 మందికి పైగా రక్త దాతలు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రసంశా పత్రాలు అందజేశారు. మధ్యాహ్నం అందరికీ భోజనం ఏర్పాటు చేశారు. వైసిపి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎల్వీ మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అన్సర్ భాషా, మాజీ కో ఆప్షన్ సభ్యుడు గులాం భాష, ఉమా మహేశ్వర రెడ్డి ని శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. మండల దళిత సంఘాల నేతలు మాలేమార్పురం మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాయలసీమ కన్వీనర్ పెంచలయ్య, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు పందికాళ్ళ మణి, దివ్యాంగులు, సీనియర్ సిటీజన్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జే ఎన్. ఆంధ్రయ్య మహేశ్వర్ రెడ్డి కి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. మహేశ్వర్ రెడ్డి మంచితనానికి, నాయకత్వానికి, స్నేహ సంబంధాలకు జన్మదిన వేడుకలు నిదర్శనంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సంధ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


# సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మాజీ సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పర్యటనను పర్యవేక్షన



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్ట్ 13:**- మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యటన మార్గం, ప్రధాన కూడళ్ళ, రద్దీ ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను పర్యవేక్షించారు.జాతీయ రహదారిపై ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత సీఐలు, ఎస్సైలకు దిశానిర్దేశం చేశారు. పర్యటన ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ ట్రాఫిక్, శాంతిభద్రతలను పర్యవేక్షించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి, అవసరమైన చర్యలు చేపట్టారు.

# నేతన్న నేస్తం అందని చేనేత కార్మికులు వెంటనే దరఖాస్తు చేసుకోండి

**- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 13:** ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చేనేత కార్మికులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కార్యాలయం కీలక విజ్ఞప్తి చేసింది. కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం కింద అందించే రూ.25 వేలు ఆర్థిక సహాయం ఇప్పటివరకు అందని చేనేత కార్మికులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. ఆగస్టు 15, 2026 తర్వాత దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వ సహాయం వర్తించదని స్పష్టం చేసింది. దీంతో అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు ఆలస్యం చేయకుండా ఈరోజు లేదా రేపటిలోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కార్యాలయం కోరింది. నేతన్న నేస్తం పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులైన చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
14- 08 - 2026

# ప్రొద్దుటూరు మార్కెట్ కమిటీ ఇన్‌చార్జ్ ఛైర్మన్‌గా పట్నం లక్ష్మణ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 13:** ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జ్ ఛైర్మన్‌గా పట్నం లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఛైర్మన్‌గా ఉన్న వద్ది సురేఖ బాలుడు అనారోగ్య కారణాలతో ఇటీవల రాజీనామా చేయడంతో, వైస్ ఛైర్మన్‌గా ఉన్న పట్నం లక్ష్మణ్‌కు ఇన్‌చార్జ్ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, నాయకులు అన్నవరం రామమోహన్‌రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, బచ్చల వీరప్రతాప్, బద్వేలి శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాస్ ఆచారి, నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, శివాలయం ఛైర్మన్ వంగల నారాయణారెడ్డి, నాయకులు ద్వారకచర్ల రాఘవరెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, వంగనూరు మురళీధర్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాముడు అన్న అభివృద్ధిని ఓర్వలేకనే రాక్షసానందం




**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 13:** రాయచోటి నియోజకవర్గంలో నేమ్ బోర్డుల ధ్వంసంపై తీవ్రంగా ఖండించిన గాలివీడు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి. గాలివీడు మండలం ఆరవీడు గ్రామం, మంగళపల్లికి వెళ్లే మార్గంలో ఇటీవల నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన శిల్పా శిలాఫలకాన్ని (నేమ్ బోర్డును) కొందరు పనిగట్టుకుని పగలగొట్టడం అత్యంత దుర్మార్గం, హేయమైన చర్య, అని ఆయన మండిపడ్డారు. రాయచోటి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం మరియు స్థానిక నాయకత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న అపూర్వమైన అభివృద్ధిని కళ్లారా చూడలేక, ఓర్వలేకే కొందరు కిందిస్థాయి రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారు. ఇది కేవలం ఒక శిలాఫలకాన్ని పగలగొట్టడం మాత్రమే కాదు, ప్రజలకు అందుతున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని వారి రాక్షస మనస్తత్వానికి నిదర్శనం. ఇంతకుముందు రాయచోటి పట్టణంలోనూ ఇదే విధంగా శిలాఫలకాలను ధ్వంసం చేసిన దుర్మార్గులు, ఇప్పుడు మండల స్థాయిలోకి కూడా ఆ నీచ రాజకీయాలను తీసుకు వచ్చారు. అభివృద్ధిని అడ్డుకోలేక, కనీసం వాటి గుర్తులను కూడా చూడలేక పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారు. ఈ సంఘటనను గాలివీడు మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి మరియు గాలివీడు మండల టిడిపి కుటుంబ సభ్యులందరూ తీవ్రంగా ఖండిస్తున్నారు, అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. చేతనైతే అభివృద్ధిలో పోటీపడండి. అంతేగానీ, ఇలాంటి చీకటి పనులతో ప్రజలను మోసం చేయలేరు! ఈ సవాలును స్వీకరించి దమ్ముంటే ముఖాముఖిగా రండి అని కసిరెడ్డి వెంకట శివారెడ్డి సవాలు విసిరారు. అభివృద్ధిని ఆపడం ఎవరి తరమూ కాదు, ఈ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతున్న వారికి ప్రజలే త్వరలో తగిన బుద్ధి చెబుతారు అని ఆయన హెచ్చరించారు.

# మహిళా రిజర్వేషన్‌పై మౌనం ఎందుకు.?

### 33 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

### ఎన్‌డీఏ ప్రభుత్వంపై కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ జ్యోతి ఆగ్రహం




**కడప మన జనప్రగతి ఆగస్టు 13:** మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించే బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టకపోవడంపై కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.డి. విజయ జ్యోతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జూలై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగిసినప్పటికీ, 19 సిట్టింగ్స్ జరిగినా మహిళా రిజర్వేషన్ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ముందడుగు వేయలేదని ఆమె విమర్శించారు. మహిళలపై నిజమైన గౌరవం, మహిళా సాధికారతపై చిత్తశుద్ధి ఉంటే 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో తక్షణమే ముందుకు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలను కేవలం ఓటర్లుగా కాకుండా పాలనలో సమాన భాగస్వాములుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని విజయ జ్యోతి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌పై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, బిల్లును త్వరితగతిన అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

# వైవీయూలో దేశభక్తిని పెంపొందించే ర్యాలీ



**కడప మన జనప్రగతి ఆగస్టు 13:-** ప్రతి విద్యార్థి తోటి సమాజం పట్ల దేశం పట్ల అభిమానంతో మెలగాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏళ్లు పూర్తిచేసుకుని 80 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న దృష్ట్యా విద్యార్థులతో అధ్యాపకులతో హర్గర్ తరంగా ర్యాలీ గురువారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ భారత పౌరుడిగా దేశభక్తిని అణువణువణ నింపుకొని దేశం గర్వించేలా జీవించాలన్నారు. సమాజ సుసంపన్నానికి బాధ్యతగల పౌరులుగా సేవలందించాల్సి ఉందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ మాట్లాడుతూ చదువుతోపాటు సమాజసేవలో భాగం కావాలన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమశిక్షణ గల పౌరులు దేశానికి సంపద లాంటివారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విశ్వవిద్యాలయ సమన్వయకర్త ఆచార్య ఎం సుభాష్ చంద్రకార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ర్యాలీ పరిపాలన భవనం నుంచి ప్రారంభమై విశ్వవిద్యాలయ రహదారుల మీదుగా కడప పులివెందుల ప్రధాన రహదారి ద్వార తిరిగి పరిపాలన భవనానికి చేరుకుంది. విద్యార్థులు, అధ్యాపకులు దేశభక్తిని పెంపొందించే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్పిఓలు, అధ్యాపకులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# దేవనకొండలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ





**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 13:** దేవనకొండ పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ కొనసాగింది. మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంఈవో ఉస్మాన్ బాషా, సీఐ వేణుగోపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మోజీ, మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, జెడ్పీటీసీ ఉచ్చురప్ప, మాజీ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, ఈఓఆర్డీ మహబూబ్ బాషా, మాజీ ఎంపీపీ గిడ్డయ్య గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, ఆకుల వీరేష్, రాజు, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### • ఆధునిక వ్యవసాయంతో అధిక ఆదాయం

### సాధించాలి: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 13:** కిసాన్ మేళా ,2026లో భాగంగా గాలివీడు మండలంలోని వ్యవసాయ శాఖ అధికార కార్యాలయ ప్రాంగణంలో, రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు, కాలానుగుణ సాగు మెలకువలు, శాస్త్రీయ విధానాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, అధిక ఆదాయం, సాధించే దిశగా రైతులు ముందుకు సాగాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, యాంత్రీకరణ, శాస్త్రీయ సాగు, విధానాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రైతు ఆదాయం పెంపే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సర్వే నెం.754 భూమిపై యజమానుల వివరణ



**కడప మన జనప్రగతి ఆగస్టు 13:-** కడప నగరం చిన్నచౌక్ గ్రామ పరిధిలోని సర్వే నెం.754/1, సబ్ డివిజన్ 754/6 భూములపై వస్తున్న కథనాల నేపథ్యంలో సంబంధిత స్థల యజమానులు వల్లంకొండు వరదరాజు వల్లంకొండు కిరణ్ కుమార్ లు స్పందించారు. గురువారం ఈ సందర్భంగా కడప నగరం వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ జి.ఓ.ఎం.ఎస్. నెం.166 ప్రకారం నిరుపేదలకు అసైన్‌మెంట్ కోసం దరఖాస్తులు తీసుకుని అర్హులైన వారికి అధికారులు స్థలాలు కేటాయించారని తెలిపారు. 2008లో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రిజిస్ట్రేషన్ దస్తావేజులు కూడా జరిగాయని, ఈ విషయంలో హైకోర్టు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. మృత్యుంజయకుంట ప్రాంతంలో వందలాది ఇళ్లు నిర్మాణాలు జరిగి, మున్సిపల్ సౌకర్యాలు కల్పించడంతో పాటు పన్నులు కూడా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సివిల్ కోర్టు పరిధిలో ఉందని, అందువల్ల వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారమే స్థలాల కేటాయింపు జరిగిందని స్పష్టం చేశారు.

# బొమ్మనహాల్‌లో వనం..మనం కార్యక్రమం

### • భావితరాల కోసం మొక్కలను సంరక్షించాలి




**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 13:** జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు టి.రామచంద్ర నాయుడు, రాష్ట్ర అ ధ్యక్షులు బి. ఎస్.కృష్ణారెడ్డి, మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్, మండల విద్యాశాఖ అధికారులు మల్లికార్జున,వీరన్న, డిప్యూటీ ఎంపిడివో వెంకటరమణ, ఆధ్వర్యంలో బొమ్మనహాల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వనంమనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు, ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ నబిరసూల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు, మొక్కలను పెంచడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చున్నారు, నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బొమ్మనాహాల్ మండలం ప్రెసిడెంట్ హరేసముద్రం రాముడు, శంకర్ నేమకల్లు వైస్ ప్రెసిడెంట్, కణేకల్ మండల్ ప్రెసిడెంట్ వెంకటేష్, మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

# అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు




**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 13:-** మండలంలోని మాచుపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సిద్ధవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. గురువారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అందిన సమాచారంతో బుధవారం మధ్యాహ్నం మాచుపల్లిలోని ఓ కిరాణా దుకాణంపై సిబ్బందితో కలిసి దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడిలో అక్రమంగా విక్రయిస్తున్న 72 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.11,460 ఉంటుందని పేర్కొన్నారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడిలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కోరం లేక సిద్ధవటం మండల సర్వసభ్య సమావేశం వాయిదా



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 13:** మండల కేంద్రమైన సిద్ధవటంలోని మండల పరిషత్ సభా భవనంలో గురువారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీటీసీలు 11 మంది ఉండగా ఎంపీపీ వెంకటసుబ్బమ్మ, మండల ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, ఎంపీటీసీ నాగిని హాజరయ్యారు. అయితే సమావేశం ప్రారంభానికి ముందే ఎంపీటీసీ నాగిని, మండల ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి సమావేశం నుంచి వెళ్లిపోవడంతో కోరం పూర్తికాలేదని ఎంపీడీవో ఫణి రాజకుమారి తెలిపారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# చిన్న ఓరంపాడులో ఘనంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ

### అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు

### నిర్వహించిన ముక్కా వరలక్ష్మి

### ఆలయ నిర్మాణానికి అన్ని విధాలా

### సహకరిస్తామని గ్రామస్తులకు భరోసా



**ఓబులవారిపల్లి మన జనప్రగతి ఆగస్టు 13:-** ఓబులవారిపల్లి మండలం చిన్న ఓరంపాడు అరుంధతివాడలో నిర్వహిస్తున్న మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి హాజరై అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన ఆమె.. గ్రామ అభివృద్ధికి, ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామస్తులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు ముందుంటామని తెలిపారు. మాతమ్మ దేవాలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు గజేంద్ర నాయుడు, కోటి నాయుడు, సుబ్బరాయుడు నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత పై పోలీసుల అవగాహన కార్యక్రమం



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 13:**–చిట్వేలి మండల పరిధి లోని రాజుకుంట గ్రామంలో గురువారం మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాలికా సంరక్షణ తదితరాలపై రైల్వే కోడూరు గ్రామీణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, డిఎస్పీ వారి ఆదేశానుసారం అన్ని గ్రామాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, బాలికల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్ లకు స్పందించవద్దు అని సూచించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్ధాలనువివరించి వాటి నివారణకు సహకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 సేవలను వినియోగించుకోవాలని, గ్రామంలో అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం తెలపాలని ఎస్ఐ. వినోద్ కుమార్ కోరారు. ఈకార్యక్రమంలో ఏ.ఎస్ ఐ. వెంగయ్య, మహిళా పోలీస్ కానిస్టేబుల్ రాధిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం..

**డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్**

**ట్రిపుల్ ఐటీ ఆవరణాల్లో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ భారత్**




**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 13:**–పరిసరాల పరిశుభ్రతే ప్రధాన ధ్యేయమని ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ వెల్లడించారు. గురువారం ట్రిపుల్ ఐటీ ఆవరణాల్లో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యాలయ ప్రాంగణాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, అధికారులు కోటేశ్వరి, కోనప్ప, సత్యానంద రామ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగతో దేశ భక్తి పెంపొందించుకోవాలి: ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ




**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 13:**– స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని పెంపొందించు కోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ వెల్లడించారు. గురువారం కళాశాల నుంచి వేంపల్లె పూరవీధుల గుండా భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విధ్యార్థులు, అధ్యాపకులు జాతీయ పతాకాన్ని పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాజీయ బేగం, అధ్యాపకులు నాగేంద్ర, జనార్దన్, మసుద, శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంధ మహోత్సవం



**కడప మన జనప్రగతి ఆగస్టు 13:**–కడప నగరంలోని అమీన్‌పీర్ దర్గాలో గంధ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. హజరత్ అమీన్‌పీర్ సాహెబ్ వారి 11వ పీఠాధిపతి హజరత్ వాజా పుల్లా మహమ్మద్ మహమ్మదుల్ ఉషని చిష్టీ ఉల్ ఖాదర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.గంధ మహోత్సవాన్ని పురస్కరించుకుని దర్గా ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు నాలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కడప పెద్ద దర్గాకు తరలివచ్చారు. గంధ మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తుల రాకతో దర్గా పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

## హైకోర్టు తీర్పుతోనైనా వైసీపీకి జ్ఞానోదయం కాలేదు

- **అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ అజెండా**
- **రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య**



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 13:**రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ ఏకైక అజెండాగా పెట్టుకుందని రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య విమర్శించారు. గురువారం సాయంత్రం రాజంపేట పార్లమెంట్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య స్వగృహంలో మండల టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీలో అవినీతిని బయటపెట్టాలంటూ మంత్రి నారా లోకేష్ చేసిన సవాల్‌ను వైసీపీ స్వీకరించలేకపోయిందని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, బాధితులు నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచిస్తూ కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసిందని తెలిపారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్1 పరీక్షల్లో అవకతవకలపై సిట్ దర్యాప్తులో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు సహా పలువురిపై చార్జిషీట్ దాఖలైందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో నియమితులైన కొందరు గ్రూప్1 అధికారులను ప్రాధాన్యత లేని పోస్టులకు బదిలీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ ఆందోళనలు చేస్తోందని ఆరోపించారు. ధర్నాలు, రాస్తారోకోల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, డాక్టర్ శివకుమార్, ఉన్నం కిరణ్‌కుమార్, పామూరు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్‌రెడ్డి, పుత్త శివానంద, యువ నాయకుడు పుత్త సుధీర్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై విధ్యార్థులకు అవగాహన కలిగి ఉండాలి: వేంపల్లె సీఐ టి.నరసింహులు



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 13:**–స్థానిక స్వామి వివేకానంద పాఠశాల విధ్యార్థులకు వివిధ చట్టాలపై సిఐ టి.నరసింహులు అవగాహన కల్పించారు. గురువారం మహిళా బధ్రత, శక్తి యాప్, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు అరికట్టడం, మాదక ద్రవ్యాల నిరోధకం, రోడ్డు బధ్రత నియమాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చిన్నతనం నుంచే చెడు వ్యసనాలకు దూరంగా మెలగాలని వెల్లడించారు. ప్రజలు, మహిళల బధ్రతకు నిరంతరం పోలిస్ వ్యవస్థ శ్రమిస్తోందన్నారు. ఆపద సమయంలో పోలీస్ రక్షణకు శక్తి యాప్ వినియోగంపై వివరించారు. అలాగే బాల్య వివాహాల వల్ల జరిగే అనార్థాలు, వీరి హక్కుల గురించి తెలిపారు. రోడ్డు బధ్రత నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించ వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపాల్ నాయక్, కరస్పాండెంట్ వివేకానంద రెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలకు ఎన్ జెన్ పోస్ట్ఆఫీస్: ప్రాంతీయ తపాలా శాఖ అధికారి ఎం.సుధాకర్



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 13:**–వినియోగదారులకు ఆధునిక సాంకేతికతతో మెరుగైన సేవలు అందించేందుకు ఎన్ జెన్ పోస్ట్ఆఫీస్ లను ఏర్పాటు చేసినట్లు కర్నూలు ప్రాంతీయ తపాలా శాఖ అధికారి ఎం.సుధాకర్ వెల్లడించారు. గురువారం ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఎన్ జెన్ పోస్ట్ఆఫీస్ ని ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఎన్ జెన్ పోస్ట్ఆఫీస్ అందుబాటులోకి రావడం వల్ల విధ్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి పోస్టల్ సేవలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. భారత తపాలా శాఖ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్, పరిపాలన అధికారి డా.రవికుమార్, తపాలా శాఖ అధికారులు లక్ష్మన్న, నాగరాజు, అభిషేక్, శశిధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తుకు బానిస కారాదు..!

**గంజాయిని నిర్మూలిద్దాం.. దేశ ప్రగతిని సాధిద్దాం: సీఐ శ్రీనివాసరావు.**




**ఓబులవారిపల్లి మన జనప్రగతి ఆగస్టు 13:**–నేటి సమాజంలో నేటి యువత మత్తు పానీయాలు గంజాయి కి బానిస అయ్యి జీవితాన్ని నాశనం చేసుకుంటు నారని రైల్వే కోడూరు రూరల్ సి ఐ శ్రీనివాసు రావు అన్నారు గురువారం తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు మేరకు రేణిగుంట డి.ఎస్.పి సూచనలు మేరకు ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామంలో యువతకు గంజాయి పై అవగాహన కల్పిస్తూ దాదాపు 150 మందికి పైనే గంజాయి శాంపిల్ను తీయించి ఎవరు మత్తుకు బానిస కాకూడదు అని ఎక్కడ గంజాయిని వాడకుండా వాటికి బానిస కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు అంతే కాకుండా దేశ భవిష్యత్తు పౌరులు పైన ఉందని ఇక పైన అలాంటి వాటికి ఎవరైనా పాల్పడిన విక్రయించిన కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు కూలి పనులు చేసుకుంటూ జులాయిగా తిరుగుతూ అలాగే విద్యార్థులకు కూడా ఈ జబ్బును అంటగడుతున్నారని అటువంటి వారిపై పిడిఎఫ్ కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి ఎస్ఐ సుజన్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బద్వేల్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఘనంగా బైక్ ర్యాలీ



**బద్వేలు మన జనప్రగతి ఆగస్టు 13:**– బద్వేలు ఆర్డిఓ చంద్రమోహన్, బద్వేల్ టిడిపి ఇన్చార్జి మంచూరు సూర్య రెడ్డి ఆధ్వర్యంలో బద్వేల్ మున్సిపాలిటీలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సుమారు 300 మోటార్ సైకిళ్లతో బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ, జాతీయ జెండాలతో నెల్లూరు రోడ్డు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు చేరుకుని, అక్కడి నుంచి తిరిగి బద్వేల్ మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ...హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను చాటాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, యువతలో దేశభక్తి స్ఫూర్తిని మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ మాట్లాడుతూ..హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు ఎంతో దోహదపడు తుందని తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత మరియు సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. సుమారు 300 మోటార్ సైకిళ్లతో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ ద్వారా బద్వేల్ మున్సిపాలిటీలో దేశభక్తి, ఉత్సాహం వెల్లివిరిసింది. జాతీయ జెండాలతో సాగిన ర్యాలీ పట్టణంలో సందడి వాతా వరణాన్ని నెలకొల్పింది. కార్యక్రమంలో ఆర్డీఓ ఎ.చంద్రమోహన్,బద్వేల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ, అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు,సిబ్బంది,యువత,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ముడియం చిన్ని

**జమ్మలమడుగు మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నిక**

**నిరుద్యోగ యువత సమస్యలపై రాజీలేని పోరాటం:ముడియం చిన్ని**



**బద్వేలు మన జనప్రగతి ఆగస్టు 13:**–భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కడప జిల్లా మహాసభలు జమ్మలమడుగు పట్టణంలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించారు. ఈ మహాసభల్లో బద్వేలు ప్రాంతానికి చెందిన ముడియం చిన్ని రెండోసారి డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ తనను రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎస్ఎఫ్ఐలో పనిచేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించానన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా నిరుద్యోగ యువత సమస్యలు, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పన కోసం ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు.డ్రగ్స్, గంజాయి వ్యతిరేకంగా సదస్సులు, జీప్ జాతాలు నిర్వహించి యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పించామన్నారు. తెలుగు గంగ, గండికోట, సోమశిల ప్రాజెక్టుల కారణంగా నష్టపోయిన గ్రామాల్లోని నిరుద్యోగ సమస్యలపై కూడా పోరాటాలు నిర్వహించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో నిరుద్యోగ యువత సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.మహాసభల్లో బద్వేలుకు చెందిన షేక్ ఆదిల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, షేక్ ఫాతిమా జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఎస్.కె. మస్తాన్ షరీఫ్, జి. అరుణ, పోరుమామిళ్లకు చెందిన ఎం. సుందరయ్యలు జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు పలువురు అభినందనలు తెలిపారు.

## వ్యవసాయంలో కొత్త ఆవిష్కరణలు రూపొందించాలి

- **మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి,**

**మార్కెట్ యార్డు చైర్మన్ డా.షఫీ నాయక్**



**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 13:**–వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలకు రైతులు ప్రాధాన్యం ఇచ్చి, ఆధునిక పద్ధతులను అవలంబించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. గాలివీడు మండల కేంద్రంలో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమంలో ఉత్తమ రైతులను మంత్రి సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సాంకేతికతను వినియోగించడంతోపాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని అన్నారు. రైతులు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికాబద్ధంగా సాగు చేయాలని సూచించారు.లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ డా. షఫీ నాయక్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు నూతన పద్ధతులను అనుసరించాలని కోరారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులను అభినందించారు.ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్న ఉత్తమ రైతులను మంత్రి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ సహకారంతో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జులేఖా బీ, తెలివాడ మసీదులకు నూతన కమిటీలు

- కమిటీ సభ్యులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత
- మసీదుల అభివృద్ధి, మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలి



**కడప మన జనప్రగతి ఆగస్టు 13:-** కడప నగరంలోని ద్వారకానగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలివాడ మసీదు, జులేఖా బీ మసీదుల నూతన కమిటీల ప్రొసీడింగ్ కాపీలను టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి కమిటీ సభ్యులకు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమంతో పాటు మసీదులు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన కమిటీలు పారదర్శకంగా పనిచేస్తూ మసీదుల అభివృద్ధికి, స్థానిక మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.ప్రొసీడింగ్ కాపీలు అందుకున్న రెండు మసీదుల కమిటీ బాధ్యులు, సభ్యులు ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమాధవికి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, మన్సూర్ అలీఖాన్ మసీదు కమిటీ ప్రతినిధులు, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

## డ్రోన్ నిఘాతో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు అదుపులోకి**

**రూ.14,230 నగదు,పేకముక్కలు స్వాధీనం**



**లింగాల మన జనప్రగతి ఆగస్టు 13:-** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్, పులివెందుల డీఎస్పీ బి. మురళి ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా లింగాల ఎస్ఐ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇప్పట్ల గ్రామంలో డ్రోన్ కెమెరాతో విస్తృతంగా నిఘా నిర్వహించారు.డ్రోన్ నిఘాలో అనుమానాస్పదంగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేకముక్కలతో పాటు రూ.14,230 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని పోలీసులు తెలిపారు.


## స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో బస్‌స్టాండ్, లాడ్జిలలో పోలీసుల విస్తృత తనిఖీలు



**కడప మన జనప్రగతి ఆగస్టు 13:-** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా ఎస్.పి. షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు చిన్న చౌకు పోలీసులు అప్రమత్తమయ్యారు.కడప ఇంచార్జి డి.ఎస్పీ బాలస్వామి రెడ్డి పర్యవేక్షణ లో చిన్న చౌకు సి.ఐ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో చిన్న చౌకు పరిధిలోని కొత్త బస్‌స్టాండ్, లాడ్జిలు, హోటళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల్లో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు, గుర్తింపు పత్రాలు, రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు.అదేవిధంగా బస్‌స్టాండ్‌లో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించి, అనుమానాస్పద కదలికలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సిబ్బంది, నిర్వాహకులకు సూచించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్112కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.చిన్న చౌకు ఎస్.ఐ హరిప్రసాద్, సిబ్బంది తనిఖీ ల్లో పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఏడేళ్ల జైలు శిక్ష

**- హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఏడేళ్ల జైలు శిక్ష**



**కడప,మన జనప్రగతి ఆగస్టు 13:-** సిద్ధవటం పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో జరిగిన హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కడప ప్రధాన జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డా. సి. యామిని తీర్పు వెలువరించారు.2023 మార్చి 12న ఉప్పరపల్లి గ్రామంలో టేకు చెట్లు నరికిన కూలీ డబ్బుల విషయంలో భీమిశెట్టి లక్ష్మీ నరసింహులు (29), పత్తూరి శ్రీనివాసులు మధ్య వివాదం ఏర్పడింది. అనంతరం శ్రీనివాసులు తన కుమారులు మణీంద్ర, నాగేంద్రలతో కలిసి లక్ష్మీ నరసింహులుపై దాడి చేయగా తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు సిద్ధవటం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి ఒంటిమిట్ట సీఐ ఆర్. పురుషోత్తం రాజు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో పోలీసుల దర్యాప్తు, సాక్ష్యాధారాల ఆధారంగా ఎ2 పత్తూరి మణీంద్ర, ఎ3 పత్తూరి నాగేంద్ర నేరం చేసినట్లు కోర్టు నిర్ధారించింది. ఇద్దరికీ ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఎ1 పత్తూరి శ్రీనివాసులుపై నేరం నిరూపితం కాలేదు.సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడంతో పాటు కేసు విచారణలో సమన్వయంతో పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ అభినందించారు. కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతమైన వాదనలు శిక్ష పడటానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారుల దాడి

- ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత..పోలీసులకు అప్పగింత
- మాండవ్య నది నుంచి రాయచోటి పరిసర ప్రాంతాలకు తరలింపు



**వీరబల్లి మన జనప్రగతి ఆగస్టు 13:-** మండల పరిధిలోని రాగిమాని తొగటపల్లి సమీపంలో మాండవ్య నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. మాండవ్య నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమై సంబంధిత ప్రాంతానికి చేరుకున్నారు.అక్కడి నుంచి రాయచోటి చుట్టుపక్కల ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించిన అధికారులు వాటిని నిలిపివేసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం పట్టుబడిన ఐదు ట్రాక్టర్లను తదుపరి చర్యల నిమిత్తం పోలీసులకు అప్పగించారు.అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నదులు, వాగుల నుంచి ఇసుకను తరలించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.మాండవ్య నది పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై నిఘా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే అధికారులకు తెలియజేయాలని స్థానికులకు సూచించారు. ఈ చర్యలతో అక్రమ ఇసుక రవాణాదారుల్లో ఆందోళన నెలకొంది.

## హత్య కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు



**సిద్దవటం మన జనప్రగతి ఆగస్టు 13:-** సిద్ధవటం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కడప ప్రధాన జిల్లా,సెషన్స్ న్యాయమూర్తి డా.సి.యామిని తీర్పు వెలువరించారు.సమర్థవంతమైన దర్యాప్తు,పటిష్టమైన సాక్ష్యాధారాలు,ప్రాసిక్యూషన్ వాదనలతో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు,సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ అభినందించారు.2023 మార్చి 12న ఉప్పరపల్లి గ్రామంలో టేకు చెట్లు నరికిన కూలీ డబ్బుల విషయంలో భీమిశెట్టి లక్ష్మీ నరసింహులు (29), పత్తూరి శ్రీనివాసులు మధ్య వివాదం జరిగింది. అనంతరం శ్రీనివాసులు తన కుమారులు పత్తూరి మణీంద్ర, పత్తూరి నాగేంద్రలతో కలిసి లక్ష్మీ నరసింహులుపై దాడి చేశారు.తీవ్రంగా గాయపడిన ఆయనను కడప రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఆది లక్షుమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి సిద్ధవటం ఎస్ఐ పి.తులసి నాగప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి ఒంటిమిట్ట సీఐ ఆర్.పురుషోత్తం రాజు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు.కడప కోర్టులో జరిగిన విచారణలో సాక్ష్యాధారాలు, పోలీసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ఏ2 పత్తూరి మణీంద్ర, ఏ3 పత్తూరి నాగేంద్రలను దోషులుగా నిర్ధారించి ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఏ1 పత్తూరి శ్రీనివాసులుపై నేరం నిరూపితం కాలేదు. కేసు విచారణలో సమన్వయంతో పనిచేసిన ప్రస్తుత ఒంటిమిట్ట సీఐ పి.వెంకటేశ్వర్లు, సిద్ధవటం ఎస్ఐ పి. హారిక, కోర్టు కానిస్టేబుల్ సి.మల్లికార్జునరావు, అప్పటి సీఐ ఆర్. పురుషోత్తం రాజు, ప్రాసిక్యూషన్ తరపున వాదించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్. ఖదీరున్‌లను ఎస్పీ అభినందించారు.

## క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి



**వీరబల్లి మన జనప్రగతి ఆగస్టు13:-** క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎస్డికేఆర్ డిగ్రీ & పీజీ కళాశాలలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ రవి శేఖర్ రెడ్డి మాట్లాడుతు విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను చురుకుగా పాల్గొనాలన్నారు. క్రీడల ద్వార ఆరోగ్యకరమైన,ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంటుందని తెలిపారు.విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతు క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,ఐక్యత,నాయకత్వ లక్షణాలను పెంపోందిస్తాయని పేర్కొన్నారు.క్రీడల్లో గెలుపొందిన విజేతలకు స్వాతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందచేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటరమణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్ వర్మకు శుభాకాంక్షలు తెలిపిన బ్యాంకు శాంతమ్మ



**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 13 :-** తిరుమల తిరుపతి దేవస్థానం ఎస్ వి బి సి చైర్మన్ గా నియమితులైన బి. శ్రీధర్ వర్మను టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ కలసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం శ్రీధర్ వర్మ ను బ్యాంకు శాంతమ్మ, తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి గజపూల మాల వేశారు. భవిష్యత్తులో మరెన్నో రాజకీయ పదవులు అలంకరించాలని ఆమె ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రేవతి భారతి హేమ జాహ్నవి అనిత సుజాత లు ఉన్నారు.



## మహిళా, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం

**రాజంపేట మన జనప్రగతి ఆగస్టు 13:-** మహిళలు, బాలికల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాజంపేట పట్టణ సి.ఐ నాగార్జున తెలిపారు. గురువారం పుల్లంపేట రహదారిపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు మహిళా భద్రత, 'శక్తి' యాప్, డయల్ 112, మహిళలు మరియు చిన్నారుల రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లు, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్, డయల్ 112, 1091, 1098, 181, 1930 వంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, ప్రతి మహిళ తన భద్రతకు సంబంధించిన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ 2026 ప్రక్రియపై ఈసీఐ ఈసీఐ సమీక్ష

**- ఎస్ఐఆర్2026 ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి**




**తిరుపతి,మన జనప్రగతి ఆగస్టు 13: -** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ2026 (ఎస్ఐఆర్2026) ప్రక్రియపై ఈసీఐ కార్యదర్శి శ్రీ సంతోష్ కుమార్ దుబే జిల్లా ఎన్నికల అధికారి, ఈఆర్ఓ లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్2026లో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసుల జారీ, పంపిణీ, అభ్యంతరాలు, దరఖాస్తులు, విచారణలు, పెండింగ్ అంశాలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.బిఎల్ఓ లు ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, దరఖాస్తులు, పత్రాలు, అభ్యంతరాలను సక్రమంగా స్వీకరించి అప్‌లోడ్ చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులు, సమాచార ప్రదర్శన, రాజకీయ పార్టీలకు అవసరమైన జాబితాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.జిల్లాలో ఎస్ఐఆర్2026 పురోగతిని కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ వివరించారు. నోటీసులు, విచారణలు, ఫారమ్6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, బి ఎల్ ఓ/బిఎల్ఎ సమావేశాల మినిట్స్ అప్‌లోడింగ్ తదితర అంశాలపై తీసుకుంటున్న చర్యలను తెలిపారు. పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించి, ఈసీఐ షెడ్యూల్ ప్రకారం ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డి ఆర్ ఓ జి. నరసింహులు, ఆర్డీవో లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కన్నా లక్ష్మీనారాయణ ప్రజాసేవా ప్రస్థానం స్ఫూర్తిదాయకం

**పదవులు కాదు.. ప్రజల విశ్వాసమే కన్నా అసలైన ఆస్తి**



**గుంటూరు మన జనప్రగతి ఆగస్టు 13: -** ఐదు దశాబ్దాలుగా ప్రజల మధ్య ఉంటూ వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకున్న సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ జీవితం యువ నాయకత్వానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.కన్నా లక్ష్మీనారాయణ 50 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన కన్నా రాజకీయ ప్రస్థానం ఎమ్మెల్యే, మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి స్థాయికి ఎదిగిందని కొనియాడారు.1989, 1994, 1999, 2004లో పెదకూరపాడు, 2009లో గుంటూరు వెస్ట్, 2024లో సత్తెనపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ఆయనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గాలు, రాజకీయ పరిస్థితులు మారినా కన్నాపై ప్రజల అభిమానం మారలేదని తెలిపారు.రాజకీయమంటే పదవి కాదని, ప్రజాసేవ, బాధ్యత, జీవితకాల నిబద్ధత అని కన్నా ప్రస్థానం చాటిందన్నారు. ఆయన సంపాదించుకున్న అసలైన ఆస్తి పదవులు కాదని, ప్రజల విశ్వాసం, కార్యకర్తల అభిమానం అని పేర్కొన్నారు. కన్నా మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని మంత్రి ఆకాంక్షించారు.

# 66 డివిజన్లతోనే ఎన్నికలు నిర్వహించాలి

**విలీన గ్రామాలను చేర్చి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి**

**పాత డివిజన్ల ప్రాతిపదికన ఎన్నికల నిర్వహణను వ్యతిరేకించిన పౌర సంక్షేమ సంఘం**

**జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు**



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 13:** కాకినాడ నగరపాలక సంస్థలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3 లక్షల 12 వేల 530 మంది జనాభా ఉన్నందున 66 డివిజన్ల పునర్విభజనతోనే ఎన్నికలు నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పాత డివిజన్ల భౌగోళిక సరిహద్దుల ఆధారంగా ఎన్నికలు నిర్వహించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 3, 2026 నాటికి పాత భౌగోళిక సరిహద్దులతోనే తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్లు 65, 175, 176తో పాటు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టంలోని 65వ సెక్షన్ ప్రకారం 2011 జనాభా ప్రాతిపదికన డివిజన్ల పునర్విభజన జరగాల్సి ఉందన్నారు. జనాభా ప్రాతిపదికను విస్మరించి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కదని పేర్కొన్నారు. **17 ఏళ్లుగా స్థానిక ఎన్నికలకు దూరం** కాకినాడ నగరపాలక సంస్థలో తూరంగి, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, చీడిగ, ఇంద్రపాలెం గ్రామాలను విలీనం చేసినప్పటికీ విలీన ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఆయా ప్రాంతాల్లో 17 ఏళ్లుగా స్థానిక ఎన్నికలు జరగడం లేదని రమణరాజు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కనీస ప్రజాస్వామ్య హక్కును, స్థానిక ప్రాతినిధ్యాన్ని కోల్పోయారని తెలిపారు. మున్సిపల్ చట్టంలోని 3వ సెక్షన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తనకున్న అధికారాలను వినియోగించి ఆరు విలీన గ్రామాలను ప్రతిపాదిత 66 డివిజన్లలో చేర్చి మొత్తం 72 డివిజన్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, నిర్లక్ష్యం కొనసాగితే కాకినాడ నగర, విలీన గ్రామాల ప్రజల తరఫున హైకోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని రమణరాజు హెచ్చరించారు. కాగా, ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. 65, 3వ సెక్షన్లతో పాటు జీవో నంబర్లు 175, 176 ప్రకారం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి

● **జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి**




**కడప,మన జనప్రగతి ఆగస్టు 13:-** జిల్లాలో వ్యవసాయం, సూక్ష్మ పరిశ్రమలు, మహిళా స్వయం ఉపాధి, ఆహార శుద్ధి రంగాలకు మరింత ప్రోత్సాహం అందేలా బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన డిసిసి, డిఎల్ఆర్సి బ్యాంకర్ల సమావేశంలో ఆయన జిల్లాలో రుణ లక్ష్యాలు, ప్రగతిని సమీక్షించారు. 202627 ఆర్థిక సంవత్సరానికి రూ. 30,610 కోట్ల రుణ ప్రణాళికకు గాను జూన్ 30 నాటికి రూ. 10,819.54 కోట్ల రుణాలు అందించి 35.34 శాతం ప్రగతి సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ, ఎంఎస్ఎంఈ రంగాలకు రుణాలు పెంచాలని సూచించారు. PMFME పథకం ద్వారా రైతులు, మహిళా సంఘాలు, చిన్న పారిశ్రామికవేత్తలకు ప్రయోజనాలు అందేలా అవగాహన కల్పించాలని, పెండింగ్ రుణ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని బ్యాంకర్లను ఆదేశించారు. కౌలు రైతులకు పంట రుణాలు, మహిళా సంఘాలకు రుణ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. 'స్టార్టప్ కడప' ద్వారా యువతకు నైపుణ్య శిక్షణతో పాటు బ్యాంకులు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల సంక్షేమం కోసం స్మార్ట్ కిచెన్లకు రెండు ఫుడ్ ట్రక్కులు అందించిన కెనరా బ్యాంకు సేవలను కలెక్టర్ అభినందించారు. ఇతర బ్యాంకులు, సంస్థలు కూడా సామాజిక బాధ్యతతో ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ

**- 'అక్రమార్కుల కమిషన్'గా మారింది: మంత్రి దుర్గేష్**




**నిడదవోలు మన జనప్రగతి ఆగస్టు 13:-** వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏపీపీఎస్సీలో అక్రమాలు జరిగాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆరోపించారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 నియామకాలపై సిట్ ఇచ్చిన నివేదిక వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలకు నిదర్శనమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రీవాల్యుయేషన్ చేసి, జవాబు పత్రాల దిద్దుబాటులో అనర్హులను ఉపయోగించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 148 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసిందన్నారు. ఉద్యోగాలు రాని నిరుద్యోగులు నిరాశ చెందవద్దని, అక్టోబర్‌లో మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు శాసనసభలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి సవాల్ చేశారు.

# పేదల పాలిట కల్పతరువు. సీఎం రిలీఫ్ ఫండ్

**- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

**బనగానపల్లె/నంద్యాల, ఆగస్టు 13:-** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 59 మంది లబ్ధిదారులకు రూ. 51,19,660 విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నామని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో పేదల పాలిట కల్పతరువుగా మారిందని మంత్రి పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు కూటమి ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో వైద్య సహాయం అందిస్తోందన్నారు. చెక్కుల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో మంత్రి స్వయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న తీరుపై కూడా ఆరా తీశారు.

# నేడు పులివెందులకు ఇన్చార్జి మంత్రి సవిత



**పులివెందుల మన జనప్రగతి ఆగస్టు 13:-** పులివెందుల లో ఒక రోజు పర్యటన నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత శుక్రవారం జిల్లాకు రానున్నారు. రోజంతా పులివెందులలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటున్నట్లు మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నుంచి జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత రోడ్డు మార్గంలో పులివెందులకు రానున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి ఆమె పాల్గొనబోతున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి అదే అతిథి గృహంలో జిల్లాలో జరుగుతున్న ఆర్ అండ్ బి పనులపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి సమీక్షించనున్నారు. సాయంత్రం 4.15 గంటల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలతో భేటీ కానున్నారు. సమావేశానంతరం ఇన్చార్జి మంత్రి సవిత తిరిగి పెనుకొండకు బయలుదేరనున్నట్లు ఆ ప్రకటనలో మంత్రి కార్యాలయం తెలిపింది.

# కొత్త ఎక్సైజ్ పాలసీపై మంత్రుల కమిటీ కసరత్తు




**విజయవాడ మన జనప్రగతి ఆగస్టు 13:-** రాష్ట్రంలో ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, తదుపరి రిటైల్ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనపై మంత్రుల సబ్ కమిటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో సమావేశమై విస్తృతంగా చర్చించింది. గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. 202426 రిటైల్ ఎక్సైజ్ పాలసీ అమలు ద్వారా జూలై 2026 వరకు వచ్చిన ఫలితాలపై అధికారులు మంత్రుల బృందానికి సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పాలసీ సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, ఆ తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి రూపొందించిన వివిధ నమూనాలను కూడా సమావేశంలో అధికారులు మంత్రుల బృందం ముందు ఉంచారు. కొత్త పాలసీ రూపకల్పన కోసం వివిధ వర్గాల నుంచి అందిన సూచనలు, అభిప్రాయాలను కూడా వివరించారు. ప్రతిపాదించిన వివిధ నమూనాలపై మంత్రుల బృందం సుదీర్ఘంగా చర్చించింది. అందుబాటులో ఉన్న సమాచారం, గణాంకాలను పరిశీలించిన అనంతరం ప్రతిపాదిత నమూనాలను మరింతగా సవరించి, సంబంధిత పూర్తి వివరాలు, ఆధారిత గణాంకాలతో మరోసారి సమర్పించాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ పనితీరు, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30 తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీని రూపొందించే ప్రక్రియలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారు. ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ఎక్సైజ్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఇండియన్ సోల్జర్ తండ్రి తొండూరు నీలకంఠ రెడ్డి నేత్రదానం



**పులివెందుల, మన జనప్రగతి ఆగస్టు 13:-** పులివెందుల మండలం చంద్రగిరి గ్రామానికి చెందిన తొండూరు నీలకంఠ రెడ్డి (74) మరణించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపే గొప్ప మానవతా సేవకు శ్రీకారం చుట్టారు. మృతుని భార్య శివ తులశమ్మ, కలకత్తా బార్డర్ సమీపంలోని వెస్ట్ బెంగాల్ ప్రాంతంలో భారత సైన్యంలో సోల్జర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కుమారుడు వెంగమునీశ్వర్ రెడ్డి, కుమార్తె విజయలక్ష్మి, కోడలు పుష్పలత లు కలిసి నేత్రదానం చేయాలని నిర్ణయించారు. అనంతరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ అరవింద్‌తో కలిసి మృతుని నివాసానికి చేరుకున్న రాజు, కుటుంబ సభ్యుల సమక్షంలో పార్థివ దేహం నుండి రెండు కార్నియాలను విజయవంతంగా సేకరించారు. సేకరించిన కార్నియాలను హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి భద్రంగా తరలించి, అవసరమైన అంధులకు మార్పిడి చేసేందుకు పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, "మరణానంతరం కూడా నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం ఉంటుంది. ప్రతి కుటుంబం నేత్రదానం పట్ల అవగాహన పెంపొందించుకొని 9966509 364, 8297672536 లకు సంప్రదించి ఈ మహోన్నత కార్యక్రమానికి ముందుకు రావాలి" అని కోరారు. నేత్రదానానికి అంగీకరించిన తొండూరు నీలకంఠ రెడ్డి కుటుంబ సభ్యులను గ్రామస్తులు, సేవాసమితి ప్రతినిధులు అభినందించారు. దేశ సరిహద్దుల్లో సేవలందిస్తున్న భారత సైనికుడి కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ నేత్రదానం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం కార్యక్రమానికి ముందుకు వచ్చిన సోల్జర్ వెంగమునీశ్వర్ రెడ్డి ని తోటి జవాన్ లు, గ్రామ పెద్దలు, బంధువులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# హోమ్ గార్డుల ఆదర్శం...పదవీ విరమణ పొందిన హోమ్ గార్డుకు రూ.3,98,310 ఆర్థిక సాయం

**జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ చేతుల మీదుగా అందచేత**

**హోమ్ గార్డుల ఐకమత్యాన్ని అభినందించిన జిల్లా ఎస్.పి**




**కడప మన జనప్రగతి ఆగస్టు 13: -** మానవత్వం, ఐకమత్యం కేవలం మాటల్లోనే కాదని జిల్లాలోని హోమ్ గార్డులు నిరూపించారు. తమతో కలిసి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన హోమ్ గార్డుకు అండగా నిలబడి అభినందనలు అందుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. లో మైదుకూరు డి.ఎస్.పి కార్యాలయంలో హోమ్ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల పి.నరసింహులు ( హెచ్.జి 177) పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పి.నరసింహులు కు తమ వంతు సాయం అందించేందుకు జిల్లాలోని హోమ్ గార్డులందరూ ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ఒకరోజు వేతనాన్ని వితరణగా ఇచ్చి పోగు చేసి రూ. 3,98,310 సేకరించారు. ఈ ఆర్థిక సాయాన్ని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ చేతుల మీదుగా రూ. 3,98,310 చెక్కును నరసింహులు కు అందచేశారు. ఈ సందర్భంగా హోమ్ గార్డుల ఐకమత్యాన్ని, వారి గొప్ప మనసును జిల్లా ఎస్.పి గారు ప్రత్యేకంగా అభినందించారు. పదవీ విరమణ పొందిన హోమ్ గార్డు కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ ఎ.శివరాముడు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174